ఇంటికే పోషకాహారం.. తగ్గనున్న భారం

బాలింతలు, గర్భిణుల్లో రక్తహీనతను అధిగమించేందుకు సంపూర్ణ ఆరోగ్యం కోసం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా పోషకాహారాన్ని అందిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి ఆహారం తీసుకునేందుకు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా ఆగస్టు 2 నుంచి లబ్ధిదారులకు నిర్దేశిత పరిమాణంలో సరుకులను ఇంటికే ఇవ్వనున్నారు. దీనికోసం పూర్తిస్థాయిలో అన్ని ఏర్పాట్లు చేశారు.

- బాలింతలు, గర్భిణులకు పంపిణీకి నిర్ణయం
- ఆగస్ట్ 2 నుంచి ప్రారంభం
- ఎంఎల్‌ఎస్ పాయింట్లకు చేరుకున్న పోషకాహార కిట్లు
- నియోజకవర్గంలో 303 అంగన్‌వాడీ కేంద్రాల్లో రంగం సిద్ధం



సత్తెనపల్లి ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు చేరుకున్న కిట్లను పరిశీలిస్తున్న సీడీపీఓ శ్రీలత, ఏసీడీపీఓ సంతోషకుమారి



బియ్యం ప్యాకెట్

నియోజకవర్గంలో అంగన్‌వాడీ కేంద్రాల సమాచారం

మండలం	అంగన్‌వాడీ కేంద్రాలు	గర్భిణులు	బాలింతలు	(0–6) చిన్నారులు
సత్తెనపల్లి టౌన్	43	263	283	4,935
సత్తెనపల్లి రూరల్	76	315	380	5,728
ముప్పాళ్ల	45	209	226	2,129
రాజుపాలెం	65	321	345	3,123
నకరికల్లు	74	427	468	4,420
మొత్తం	303	1,535	1,702	20,335

ఒక్కొక్కరికి నెలకు అందించే ఆహారం

బియ్యం	:3 కిలోలు
కందిపప్పు	: 1 కిలో
నూనె	:500 గ్రాములు
కోడిగుడ్లు	: 25
పాలు	: 5 లీటర్లు
రాగి పిండి	: 2 కిలోలు
అటుకులు	:1 కిలో
ఖర్జూరం	: 250 గ్రాములు
బెల్లం	: 250 గ్రాములు

సత్తెనపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ, పోషణ ప్లస్ కార్యక్రమాల కింద ప్రతి నెలా పోషకాహారం అందిస్తున్నారు. అయితే, కేంద్రాలు దూరంగా ఉండటంతో కొందరు, ఆరోగ్య సమస్యల కారణంగా మరికొందరు రావడం లేదు. ఈ నేపథ్యంలో పోషకాహారాన్ని కేంద్రంలోనే తీసుకుంటారా? ఇంటికి తీసుకువెళ్తారా? సరుకులు ఇంటికి ఇవ్వమంటారా? అనే దానిపై గత నెలలో లబ్ధిదారుల నుంచి అభిప్రాయాలు సేకరించారు.

అధిక శాతం ఇంటికి అందించాలని చెప్పడంతో మళ్లీ లబ్ధిదారులకు సరుకులు ఇంటికే ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. ఆగస్టు 2నుంచి అది అమలు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. నియోజకవర్గంలో కోవిడ్ సమయంలో రెండేళ్లపాటు టీహెచ్‌ఆర్ (టేక్ హోమ్ రేషన్) పేరుతో సరుకులు లబ్ధిదారుల ఇళ్లకే అందించారు. కోవిడ్ తగ్గుముఖం పట్టడంతో అంగన్‌వాడీ కేంద్రాల్ని మళ్లీ తెరిచారు. ప్రభుత్వం గత ఏడాది జూన్ ఒకటి నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లోనే లబ్ధిదారులకు వేడిగా భోజనం వండి పెట్టాలని ఆదేశించింది. ఆ మేరకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని అందించారు. కానీ పూర్తిస్థాయిలో లబ్ధిదారులు ఆసక్తి చూపకపోవడంతో మెనూలో కొంత వెసులుబాటు కల్పించారు. నెలలు నిండడం, ఆరోగ్య సమస్యలు, చిన్నారుల సంరక్షణ వంటి కారణాలతో ఇంటికి తీసుకు వెళ్లేందుకు అవకాశం కల్పించారు. మెజార్టీ సభ్యులు ఇంటికే సరుకులు కూడా ఇవ్వాలని కోరడంతో నెలలో రెండు విడతలుగా అందించేందుకు చర్యలు చేపట్టారు.

నెలలో రెండు విడతలుగా...

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారం ఆగస్టు 2 నుంచి సరుకుల రూపంలో ఇంటికే ఇవ్వాలని ఉన్నతాధికారులు సూచించారు. ప్రతి నెలా ఒకటి నుంచి 5వ తేదీల మధ్య మొదటి విడతగా బియ్యం, కందిపప్పు, నూనె, కోడిగుడ్లు, పాలు, రాగి పిండి, అటుకులు, బెల్లం, చిక్కీలు, ఎండు ఖర్జూరం, రెండో విడతగా 16, 17 తేదీల్లో కోడిగుడ్లు, పాలు ఇస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న జొన్న పిండి స్థానంలో రాగి పిండి పంపిణీ చేయనున్నారు.

ఏర్పాట్లు పూర్తి



లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా పోషకాహారం పంపిణీకి చర్యలు తీసుకుంటాం. ఆగస్టు 2 రాష్ట్రంలో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి లాంఛనంగా పంపిణీని ప్రారంభిస్తారు. స్థానికంగా రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాం.

– టి. శ్రీలత, సీడీపీఓ, సత్తెనపల్లి

క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

సత్తెనపల్లి: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని సోమవారం ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కొలిమి షమ్మి ఆదివారం తెలిపారు. ఈ సమావేశానికి ఎక్స్‌అఫీషియోగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. అజెండాలోని అన్ని అంశాల్ని చర్చించి ఆమోదించనున్నట్లు తెలియజేశారు. సమావేశానికి అన్ని వార్డుల కౌన్సిలర్లు, కో–ఆప్షన్ మెంబర్లు, సెక్షన్ హెడ్లు, అధికారులు హాజరుకావాలని కమిషనర్ కోరారు.

గుంటూరు జీజీహెచ్‌లో గుర్తు తెలియని మృతదేహం



సత్తెనపల్లి: పట్టణంలోని వావిలాల పార్కు దగ్గర గల కస్తూర్బా గాంధీ విద్యాలయం వద్ద రోడ్డు మీద పడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని ఈ నెల 27న సత్తెనపల్లి టౌన్ పోలీసులు గుంటూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేర్పించారు. ఆ వ్యక్తి ఈ నెల 29న రాత్రి 10 గంటల సమయంలో మరణించాడు. మృతుడ్ని గుర్తించిన వారు యు. శోభన్‌బాబు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు, సత్తెనపల్లి టౌన్ లేదా 9440796230, 08641 – 232333 నంబర్లకు సమాచారం అందించాలని ఆదివారం కోరారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



రాజుపాలెం: మండలంలోని దేవరంపాడు, పెదనెమలిపురిలో చిలకలూరిపేటకు చెందిన త్రైత సిద్ధాంతం ప్రబోధ సమితి ఆధ్వర్యంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. రెండు గ్రామాలలో ఇంటింటా తిరిగి భగద్గీతలోని సారాంశాన్ని వివరించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు యద్దనపూడి వీరాంజనేయులు, సభ్యులు మేకల వెంకటేష్, సామ్రాజ్యమ్మ, వై.చిలకమ్మ, స్వర్ణ, నరేంద్ర, రామాంజనేయులు, చిరంజీవి, చిర్రా వెంకట రామిరెడ్డి, గంగయ్య, వెంకటేశ్వరనాయక్, కోటేశ్వరమ్మ, రాఘవ, శ్రీకాంత్, పుల్లయ్య పాల్గొన్నారు.

కార్డన్ సెర్చ్‌లో పలు వాహనాల స్వాధీనం



నకరికల్లు: అనుమతి పత్రాలు, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ బి.ఆదినారాయణ హెచ్చరించారు. మండలంలోని చల్లగుండ్లలో ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఆకస్మిక తనిఖీతో ప్రజలు ఉలిక్కిపడ్డారు. పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఒక్క చల్లగుండ్లలోనే సరైన పత్రాలు లేని 24 ద్విచక్ర వాహనాలు సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఏ.బాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

నిమ్మకాయల ప్రమాణ స్వీకారానికి తరలిన శ్రేణులు



సత్తెనపల్లి: గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ ప్రమాణ స్వీకారానికి ఆదివారం సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబూరావు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నేతలు గుంటూరు తరలి వెళ్లారు. పెండెం మిత్రమండలి, కట్టమూరు నాయకుడు దార్ల ఏడుకొండలు, నాయకులు నేలటూరి కోటేశ్వరావు, జడ ప్రసాద్, పాటిబండ్ల రామారావు, కేతుమాల ఇస్తాయేలు, కతుమాల ప్రేమయ్య, మద్దు ఆశోక్, మద్దు నాగేశ్వరరావు, నరసింహారావు తదితరులు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసుకొని గుంటూరు వెళ్లారు.

విత్తన ఎంపికలో జాగ్రత్తలు తప్పనిసరి

ముప్పాళ్ల: ఖరీఫ్ సీజన్‌లో విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ ఆదివారం సూచించారు. విత్తనాల నాణ్యత పరిశీలించాకే కొనుగోలు చేయాలని తెలిపారు. సంచిపై ట్యాగ్, తేదీ వివరాలు, పంట కాలం వివరాలన్నీ సరిగ్గా ఉన్నాయో లేదో పరిశీలించుకున్న తర్వాతే విత్తనాన్ని ఎంపిక చేసుకోవాలని చెప్పారు. విత్తనం తేమ, మొలక శాతం పరిక్షించుకున్న తర్వాతే గుర్తింపు పొందిన డీలరు వద్దే కొనుగోలు చేసుకోవాలని తెలిపారు. తప్పనిసరిగా రశీదు తీసుకొని జాగ్రత్త పరుచుకోవాలని చెప్పారు. ముందస్తుగా దుక్కులు లోతుగా దున్నుకొని వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగుకు సన్నద్ధమవ్వాలని ఆమె తెలియజేశారు. ప్రస్తుత తరుణంలో తక్కువ పంట కాలం ఉన్న విత్తనాలనే ఎంపిక చేసుకుంటే మంచిదని ఆమె సూచించారు.

భక్తిశ్రద్ధలతో విష్ణు సహస్ర నామ పారాయణం

సత్తెనపల్లి: పట్టణంలోని వడ్డవల్లి శ్రీ రామాలయం, శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానాల్లో ఆదివారం ఉదయం అధిక మాసం ఏకాదశి సందర్భంగా భక్తులు భక్తిశ్రద్ధలతో విష్ణు సహస్ర పారాయణం జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

జగనన్న సురక్షలో 98 శాతం దరఖాస్తులకు పరిష్కారం

అమరావతి: మండల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారంతో జగనన్న సురక్ష ముగిసింది. 16 రోజుల్లో 16 సచివాలయాల పరిధిలోని ఇరవై గ్రామాల్లో కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల స్థాయి అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి ప్రజల సమస్యల్ని పరిష్కరించారు. మండలంలో ప్రజల నుంచి 5,200 దరఖాస్తులు రాగా, ఇందులో 5,017 దరఖాస్తుల్ని అధికారులు పరిష్కరించారు. 98 శాతం లక్ష్యాన్ని సాధించి, ఏడు వేల కుటుంబాలకు లబ్ధి చేకూర్చారు. మండల పరిధిలోని ఇరవై గ్రామాల్లో ప్రజలకు 5,017 ధ్రువీకరణ పత్రాల్ని ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా అధికారులు పంపిణీ చేశారు. ఇందులో 1976 ఆదాయ, 1780 కుల, 278 రెన్యువల్ ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయి. 472 ఆధార్ కార్డుల్లో సవరణలు, 222 బియ్యం కార్డులో చేర్పులు, 26 కౌలు గుర్తింపు కార్డులు, 17 కుటుంబాల నుంచి విడిపోవడం, 40 నూతన బియ్యం కార్డులు, 25 బియ్యం కార్డు నుంచి విడిపోవటం, 95 బియ్యం కార్డులో తొలగింపులు, మూడు రెవెన్యూ శాఖలో మ్యూటేషన్‌లు, రెండు ఈసీలు, 11 వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో మార్పులు, నాలుగు ఈడబ్ల్యూస్ సర్టిఫికెట్లు, తొమ్మిది నూతన హెల్త్ కార్డులు, 22 లేట్ బర్త్ సర్టిఫికెట్లు, ఒకటి లేట్ డెత్ సర్టిఫికెట్, 21 ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు ఉన్నట్లు అధికారులు వివరించారు.

ఉమ్మడి సివిల్ కోడ్‌తో లౌకికవాదానికి విఘాతం



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు

అమరావతి: స్థానిక తల్లం బ్రహ్మయ్య స్మారక భవనంలో ఉమ్మడి సివిల్ కోడ్ (యూసీసీ)పై రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఆదివారం సీపీఎం శాఖా కార్యదర్శి షేక్ మొహిద్దీన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా నాయకుడు జి.రవిబాబు మాట్లాడుతూ విభిన్న మతాలు సంప్రదాయాలు, ఆచారాలున్న భారతీయ సమాజంలో ఏకరూప పౌర స్మృతి (యూసీసీ) సాధ్యం కాదన్నారు. 21వ లా కమిషన్ యూసీసీ అమలు చేయడం సాధ్యం కాదని, సమైక్యత, సమగ్రతకు ముప్పు ఏర్పడుతుందని చెప్పినప్పటికీ బీజేపీ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని విమర్శించారు. 22 లా కమిషన్ వేసి యూసీసీ ఎలా ఉంటుందో చెప్పకుండా ప్రజల ముందుకు చర్చ తీసుకురావడం వారిని గందరగోళాలకు గురి చేయడమేనని పేర్కొన్నారు. ముస్లిం మహిళలకు విముక్తి కలిగించడానికి యూసీసీ తీసుకొస్తున్నామంటు మతాల మధ్య చిచ్చు రాజేస్తున్నారని ఆరోపించారు. సీపీఎం మండల కార్యదర్శి బి. సూరిబాబు మాట్లాడుతూ హిందూ మతంలోనే దక్షిణాదిలో ఒకరకంగా, ఉత్తరాదిలో మరో రకమైన ఆచార, సంప్రదాయాలున్నాయని తెలిపారు. అసలు హిందూ మతంలోనే ఉమ్మడి సివిల్ కోడ్ సాధ్యం కాదని అభిప్రాయపడ్డారు. ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండాలో భాగంగా మాత్రమే కేంద్ర ప్రభుత్వం యూసీసీని ముందుకు తీసుకు వచ్చిందని, లౌకికవాదులు, ప్రజాస్వామ్యకువాదులు ఇటువంటి వాటిని వ్యతిరేకించాలని ఆయన కోరారు. సమావేశంలో వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు దారా ప్రసాద్, పలుకూరి రోశిబాబు, తాడిబోయిన సుబ్బారావు, శృంగారపాటి రాజ్ కుమార్, తల్లం ప్రదీప్, నండూరి వెంకటేశ్వరరాజు పాల్గొన్నారు.

మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులు అమానుషం



సత్తెనపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న, పరంధామయ్య తదితరులు



గుండ్లపల్లిలో నిరసన తెలుపుతున్న దళిత, గిరిజన సంఘాల నాయకులు

సత్తెనపల్లి: మణిపూర్‌లో అల్లర్లు, మారణ హోమానికి నిరసన వ్యక్తం చేస్తూ సత్తెనపల్లి పట్టణంలో మహాజన దళిత సమితి (ఎండీఎస్) ఆధ్వర్యంలో ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో హోలీ ఫ్యామిలీ స్కూలు దగ్గరున్న మదర్ థెరిస్సా విగ్రహం నుంచి తాలూకా సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతి పత్రం అందించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలోనే మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులు జరుగుతున్నాయంటూ పలువురు వక్తలు ధ్వజమెత్తారు. మారణ హోమానికి కారకుల్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకం గా నినాదాలు ఇచ్చారు. ర్యాలీలో ఎండీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దీపాల పరంధామయ్య, కార్యదర్శి బండారు ఏలీయా, గార్లపాటి సునీల్, పాస్టర్ తిమోతి, పాస్టర్ దేవయ్య, బొక్క సంగీతరావు, చిలుకా అగస్టస్ బాబు, పచ్చల నాగేశ్వరావు, ముదిగొండ ఈశ్వర, మూల్పూరు చంటి, మూల్పూరు సిసింద్రీ, దేవరకొండ సంజీవ్, సందేపోగు రాజేష్, బండారు నాగరాజు, బండారు నాగరాజు, యెల్లటూరి యోహాను, మహేష్, కంభంపాటి రజని, మందా వంశీ, గొర్రెపాటి కోటేశ్వరరావు, నన్నేపాగ ప్రశాంతి, పినపాటి మహాలక్ష్మి, బండారు కోటమ్మ, బొడ్డు విజయమ్మ పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

నకరికల్లు: మణిపూర్ మారణకాండలో నిందితుల్ని సత్వరమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని పలు దళిత, గిరిజన సంఘాల నేతలు డిమాండ్ చేశారు. మండలంలోని గుండ్లపల్లిలో క్రైస్తవ, దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడు నెలలుగా మహిళల ప్రాణాలు పోతున్నా, మారణకాండలు, అరాచకాలు జరుగుతున్నా అధికార బీజేపీ పట్టించుకోక పోవడం శోచనీయమని విమర్శించారు. కార్యక్రమంలో లూథరన్ పాస్టర్ రెవరెండ్ వి.ప్రవీణ్‌కుమార్, పాస్టర్లు దావీదు, బూదెయ్య, మాల మహానాడు సోషల్ మీడియా ఇన్‌చార్జి గోదా బాల, జంగా బ్రహ్మయ్య, జూలూరి రమేష్, జెల్డి మార్తయ్య, కోపూరి పూర్ణయ్య, కాసిమళ్ల వెంకట్రామయ్య, అరుణ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

లూథరన్ సంఘం ఆవిర్భావ దినోత్సవం



మణిపూర్‌లో శాంతి కోరుతూ ప్రార్థనలు

క్రోసూరు: స్థానిక లూథరన్ చర్చిలో సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చర్చి ఫాదర్ రెవరెండ్ డాక్టర్ ఎం.సుందరరావు మాట్లాడుతూ 1842లో అమెరికా మిషనరీ ఫాదర్ హయ్యర్ లూథరన్ సంఘం తరపున గుంటూరుకు వచ్చారన్నారు. ఆయన ఆధ్వర్యంలో ఏర్పాటైన సంఘం అప్పటి నుంచి ఆధ్యాత్మిక, విద్య, వైద్య రంగాల్లో సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలోకూడా అనేకసార్లు సేవలు అందించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మణిపూర్‌లో శాంతి కోరుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో స్థానిక పాస్టరమ్మ హస్సిబా, సంఘ పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

సత్తెనపల్లి: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పట్టణంలోని భీమవరం రోడ్డులో గల రైల్వే ట్రాక్‌పై ఆదివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని లెనిన్ నగర్‌కు చెందిన వై.శ్రీనివాసరావు (51) కార్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం వెళ్లదీస్తున్నాడు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఒక కుమార్తెకు వివాహమైంది. కుటుంబ కలహాలు, అప్పుల కారణంగా శ్రీనివాసరావు ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

మహిళ మెడలోని నల్లపూసల బంగారు గొలుసు అపహరణపై ఆదివారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు కొరిటిపాడుకు చెందిన పుష్పావతి కుమార్తెతో సత్తెనపల్లిలో బంధువుల ఇంటికి వచ్చారు. పని ముగించుకొని తిరిగి కుమార్తెతో వెళుతూ గుంటూరు బస్టాప్ సెంటర్‌లో ఆగారు. ఈలోగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి పుష్పావతి మెడలోని నాలుగు సవర్ల నల్లపూసల బంగారు గొలుసును అపహరించుకుపోయారు. దీనిపై ఆమె పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ సీఐ యు.శోభన్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు పిల్లల చదువు కోసం దత్తత



దత్తత తీసుకున్న పిల్లలకు పుస్తకాలు, యూనిఫాం అందిస్తున్న కొత్త రామకృష్ణ

సత్తెనపల్లి: పట్టణంలోని ఆదరణ అనాథ ఆశ్రమంలో పెరుగుతున్న ఇద్దరు పిల్లల్ని వారి చదువుల నిమిత్తం ఆర్యవైశ్య యువజన సంఘం పట్టణ అధ్యక్షులు కొత్త రామకృష్ణ దత్తత తీసుకున్నారు. ఆదివారం వారి చదువు కోసం యూనిఫామ్స్, పుస్తకాలు అందించారు. స్థానిక నారాయణ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో చదువుతున్న ఈ ఇద్దరు పిల్లల్లో విష్ణు ఆరో తరగతి, అశ్విని ఐదో తరగతి చదువుతున్నారు.

ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న అనాథ పిల్లల్ని దత్తత తీసుకుని వారి చదువులు, ఉస్తకాలు, యూనిఫామ్ అందజేస్తామని రామకృష్ణ తెలిపారు. ఆదరణ అనాథాశ్రమం నిర్వాహకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ కొత్త రామకృష్ణ ఎంతో సహకారం అందిస్తున్నారని, ప్రత్యేకించి పిల్లల చదువుల మీద ఎక్కువ శ్రద్ధ చూపిస్తారని తెలిపారు. ప్రత్యేకించి ఈ సంవత్సరం ఇద్దరు పిల్లల్ని చదువు నిమిత్తం సుమారు రూ. 35 వేలు ఖర్చు అవుతాయని, ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని తెలియజేయడంతో వారిని దత్తత తీసుకొని వారికి కావాల్సిన మౌలిక వసతులను సమకూరుస్తామని హామీ ఇచ్చారన్నారు. పిల్లల్ని దత్తత తీసుకున్న ఆయనకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యులు, మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

అమరావతి: మండలంలోని నరుకుళ్లపాడుకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త చింకా అల్లిబాబు, మర్రి నాగభూషణం అనారోగ్యంతో మరణించినారు. భౌతికాయాల్ని ఆదివారం పెదకూరపాడు శాసనసభ్యుడు నంబూరు శంకరరావు సందర్శించారు. పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు. ఆదే గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త కొలకలూరి కిశోర్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఇంటి వద్ద చికిత్స పొందుతున్నారు. ఆయన్ను కూడా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు ఆళ్ల శ్రీనివాసరెడ్డి, నల్లిబోయిన శ్రీనివాసరావు, పాటిబండ్ల అమృతవేణి ఉన్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

అర్ధరాత్రి అదృశ్యం
ఉదయం బావిలో శవమై తేలిన వైనం



కరీంబాబు మృతదేహం

యడ్లపాడు: ఆస్తి తగాదాల నేపథ్యంలో వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన సంఘటన మండలంలోని కోట గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. మృతుని బంధువుల కథనం ప్రకారం.. కొండవీడు గ్రామానికి చెందిన కరీంబాబు (45) కొద్దికాలంగా గుంటూరులోని ఆనందపేట 8వ లైన్‌లో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 28వ తేదీ సాయంత్రం మొహర్రం కార్యక్రమాన్ని తిలకించేందుకు స్వగ్రామానికి వచ్చారు. అదేరోజు రాత్రి 11.30 నుంచి కుటుంబ సభ్యులకు కనిపించకుండా పోయాడు. అదృశ్యమైన కరీంబాబు ఆదివారం గ్రామంలోని బావిలో శవమై కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. భార్య సర్తాజ్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి.సురేష్ తెలిపారు. అయితే, కరీంబాబు తల్లి ఇమామ్‌బీకి చెందిన 19 సెంట్ల స్థలం ఉందని, సదరు స్థలం వివాదంలో కరీంబాబును హత్యచేసి బావిలో వేసి ఉంటారని బంధువులు ఆరోపిస్తున్నారు. అయితే, సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

చిలకలూరిపేట: నిరుపేదలకు వైద్య సేవలు అందించే లక్ష్యంతో రోటరీ సంస్థ ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట అధ్యక్షుడు కాపు వెంకటరావు చెప్పారు. పట్టణంలోని రోటరీ కమ్యూనిటీ హాలులో క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు ఉచితంగా అందించారు. వైద్య శిబిరంలో మందుల కోసం రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందించిన దేవినేని అశోక్‌కు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఆళ్ల వేమనరెడ్డి, జాష్టి రంగారావు, తోటకూర వెంకట నారాయణ, దండా లక్ష్మీనారాయణ, తొట్టెంపూడి వెంకటేశ్వరరావు, డాక్టర్ పీవీ సుబ్బారావు పాల్గొన్నారు.

రక్తదానం అభినందనీయం

ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్



రక్తదానం చేస్తున్న యువకుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్

చిలకలూరిపేట: రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల రీజినల్ కో–ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్ చెప్పారు. పట్టణంలోని ఎస్‌ఎంఎస్ గార్డెన్స్‌లో దిల్‌సే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలిచే గొప్ప కార్యక్రమం ఇదని కొనియాడారు. ఫౌండేషన్ ఏర్పాటు చేసుకొని ఇలాంటి సమాజ సేవా కార్యక్రమాలకు యువత ముందుకు రావడం ఆదర్శనీయమని వెల్లడించారు. భవిష్యత్తులోనూ ఇలాంటి మంచి కార్యక్రమాలు నిర్వహించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం రక్తదానం చేసిన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని పాల్గొని అభినందనలు తెలిపారు. సీపీటీ బ్లడ్‌బ్యాంక్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 120 మంది రక్తదానం చేశారు. దిల్‌సే ఫౌండేషన్ సభ్యులు షేక్ ఖాజా హసన్, సలీం, అబ్దుల్, రహీం, ఘన్‌సైదా, రఫీ తదితరులు పాల్గొన్నారు.

లయన్‌గా ఇమ్మిడిశెట్టి సేవలు చిరస్మరణీయం



ఇమ్మిడిశెట్టి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

సత్తెనపల్లి: లయన్స్ క్లబ్‌కు ఇమ్మిడిశెట్టి జగన్మోహనరావు సేవలు చిరస్మరణీయమని అధ్యక్షుడు మంచికంటి వెంకటేశ్వరరావు కొనియాడారు. స్థానిక పెన్షనర్స్ హాలులో ఆదివారం సత్తెనపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇమ్మిడిశెట్టి సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్లబ్‌కు ఆయన అందించిన సేవలు, సహాయసహకారాలు చిరస్మరణీయ మైనవని సభ్యులు కొనియాడారు. ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించి, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి వల్లూరి శ్రీనివాసరావు, సీనియర్ సభ్యులు కంబాల వెంకటేశ్వరరావు, వై.పి.మురళీకృష్ణ, పెద్దింటి చంద్రయ్య, వి.వి.ఆర్. కృష్ణమాచార్యులు, పొత్తూరి రామకోటయ్య, గ్రంధిశిల శ్రీనివాసరావు, పెద్దింటి వెంకటేశ్వర్లు, తిరుమల శ్రీనివాస్, డాక్టర్ నరసింహారావు, తవిటి భావన్నారాయణ పాల్గొన్నారు.